
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం ၊ 7 ၊ ఫిబ్రవరి ၊ 2024



సోమశిలలో 24.037 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 24.037 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువల ద్వారా 3,180 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	- రూ.64,380
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	- రూ.5,782
3 శాతం జీఎస్టీతో..	- రూ.5,955
నవర (8 గ్రా)	- రూ.47,460

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.0 /23.3

మంగళవారం గాలిలో తేమ 62 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. బుధవారం ఎలాంటి మార్పులు ఉండబోవని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

డీఈఓగా పీవీజే రామారావు

• గంగాభవాని పదోన్నతిపై బదిలీ

నెల్లూరు(టౌన్): జిల్లా విద్యాశాఖాధికారిగా పీవీజే రామారావు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం రాత్రి విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన ప్రస్తుతం బాపట్ల జిల్లా ఎఫ్ఏసీ డీఈఓగా పనిచేస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న డీఈఓ గంగాభవాని పదోన్నతిపై వయోజన విద్య జాయింట్ డైరెక్టర్‌గా వెళ్లారు. ఈమె ఏడాదిపాటు జిల్లాలో పనిచేశారు.

ఏపీజీఈఏ జిల్లా కార్యవర్గ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

• మార్చి 3న నామినేషన్ల ప్రక్రియ

నెల్లూరు(పొగతోట): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వోద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) జిల్లా శాఖ ఎన్నికల నోటిఫికేషన్‌ను మంగళవారం ఆ శాఖ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జి.నాగసాయి విడుదల చేశారు. నగరంలోని కేవీఆర్ పెట్రోల్ బంక్ సమీపంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో మార్చి 3వ తేదీ ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు నామినేషన్ పత్రాలు స్వీకరిస్తామని తెలిపారు. స్క్రూటినీ అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు పోటీలో అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామని తెలిపారు. పోటీ అనివార్యమైతే మార్చి 17వ తేదీ ఉదయం 10 గంటలకు ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తి ప్రజాస్వామిక విధానంలో శాంతియుతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని సభ్యులను కోరారు.

డీఎస్ఓ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(పొగతోట): జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారిగా వెంకటరమణ మంగళవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో డీఎస్ఓగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లును ఆ శాఖ కమిషనర్ కార్యాలయానికి సరెండర్ చేయడంతో పోస్టు ఖాళీ అయింది. దీంతో వెంకటరమణను డీఎస్ఓగా నియమించారు.

ప్రాక్టికల్స్‌కు 106 మంది గైర్హాజరు

నెల్లూరు(టౌన్): ఇంటర్మీడియట్ ఒకేషనల్ విద్యార్థులకు జరుగుతున్న ప్రాక్టికల్స్ పరీక్షలకు మంగళవారం జిల్లావ్యాప్తంగా మొత్తం 106 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం 382 మందికి గాను 316 మంది విద్యార్థులు హాజరుకాగా 66 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 382 మందికి గాను 342 మంది హాజరుకాగా 40 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

ఏప్రిల్‌లో డ్రాయింగ్, హ్యాండ్‌లూమ్ పరీక్షలు

నెల్లూరు(టౌన్): టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు–2024కు సంబంధించి డ్రాయింగ్, హ్యాండ్‌లూమ్, వీవింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడర్ లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలు ఏప్రిల్ నెలలో నిర్వహించనున్నట్లు డీఈఓ గంగాభవాని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, అలాగే సంబంధిత ట్రేడ్‌లలో లోయర్ గ్రేడ్, తత్సమాన పరీక్ష పాసైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఏపీలో కాకుండా ఇతర రాష్ట్రాల్లో లోయర్ గ్రేడ్, లేదా తత్సమాన పరీక్ష పాసైన వారు తప్పనిసరిగా సంచాలకులు, ప్రభుత్వ పరీక్షలు, ఆంధ్రప్రదేశ్ అనుమతి పొందిన అనంతరం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పరీక్ష ఫీజు ఈ నెల 20వ తేదీ లోపు చెల్లించాలని పేర్కొన్నారు. వివరాలకు నెల్లూరు దర్గామిట్టలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో పరీక్షల విభాగాన్ని సంప్రదించాలని తెలిపారు.

క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వండి



పోటీల్లో పాల్గొన్న మహిళా ఉద్యోగులతో వీసీ

వెంకటాచలం: 'క్రీడలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అందువల్ల ఉద్యోగులు వాటికి ప్రాధాన్యం ఇవ్వాలి' అని విక్రమ సింహపురి యూనివర్సిటీ వీసీ జీఎం సుందరవల్లి అన్నారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వర్సిటీలో అంతర్ కళాశాలల మహిళా ఉద్యోగుల టోర్నమెంట్‌ను వీసీ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలోని ఒత్తిడి నుంచి బయటపడేందుకు క్రీడలు దోహదపడతాయన్నారు. ఆడేందుకు వయసుతో సంబంధం లేదన్నారు. త్రోబాల్ పోటీల్లో డాక్టర్ సి.విజయకళ టీమ్ గెలిచింది. ఎం.అమ్మాజీ టీమ్ రెండో స్థానంలో నిలిచింది. వారికి వీసీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ విజయానంద్ కుమార్‌బాబు, పరీక్షల నియంత్రణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ కె.సునీత ఆర్గనైజింగ్ సెక్రటరీ వై.రవీంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణాల తొలగింపుపై అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ వికాస్‌మర్మత్

అక్రమ నిర్మాణాల తొలగింపు

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని కొత్తూరు, ఎస్‌జీఓ లేఅవుట్‌లోని అనధికార తాత్కాలిక నిర్మాణాలను కమిషనర్ వికాస్‌మర్మత్ పర్యవేక్షణలో టౌన్‌ప్లానింగ్ విభాగం సిబ్బంది మంగళవారం తొలగించారు. కమిషనర్ మాట్లాడుతూ స్థానిక స్థలాన్ని ప్రజాప్రయోజనాల కోసం కేటాయించి ఉన్నామని, అన్యాక్రాంతం అవుతుందన్న స్థానికుల సమాచారంతో ఈ ప్రాంతాన్ని సందర్శించి ఆక్రమణలను గుర్తించామని తెలిపారు. నెల్లూరు టౌన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, టౌన్‌ప్లానింగ్ సిటీ ప్లానర్ దేవీకుమారి, టీపీఓ దశయ్య పాల్గొన్నారు.



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న రవాణాశాఖ అధికారులు

రహదారి భద్రతపై అవగాహన

నెల్లూరు (టౌన్): రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం రవాణాశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఆత్మకూరు బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సుల డ్రైవర్లు, కండక్టర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ బాబు, ఏఎంవీఐ పూర్ణచంద్రరావులు డ్రైవింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను డ్రైవర్లకు వివరించారు. బస్సులోకి ప్రయాణికులు ఎక్కేటపుడు, దిగేటపుడు పాటించాల్సిన నియమాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రవాణాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



రామకోటయ్యనగర్‌లో పర్యటిస్తున్న మేయర్ స్రవంతి

రూ.7 కోట్లతో అభివృద్ధి పనులు

నెల్లూరు(బారకాసు): గడిచిన సంవత్సర కాలంలోనే నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని 31వ డివిజన్‌లో రూ.7 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయని మేయర్ పొట్లూరి స్రవంతి జయవర్ధన్ అన్నారు. మంగళవారం 31వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ స్థానిక ప్రజలు వంద మీటర్ల సిమెంట్ రోడ్డు కావాలని అడిగారని వెంటనే రూ.10 లక్షలు మంజూరు చేయించామని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు, నగర పాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

వరాలవలె.. జలాలనిచ్చె

అన్నదాతల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకుసాగుతోంది. రైతుల కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ వ్యవసాయాన్ని పండగ చేసింది. రైతులు సాగు చేస్తున్న భూములకు సాగునీరందించే విషయంలో అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. కావలి కాలువ ఆయకట్టు పరిధిలో వరి పంట ఎండిపోకుండా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అదనపు జలాలు కేటాయించడంతో వారి ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

- సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఔదార్యం
- కావలి కాలువకు అదనపు జలాలు
- సాధనలో మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సఫలం
- వేలాది మంది రైతుల్లో ఆనందం
- 15 వేల ఎకరాల వరి పైరుకు ప్రయోజనం



కావలి కాలువ ఆయకట్టు : **లక్ష ఎకరాలు**

ప్రస్తుతం సాగులో ఉన్న ఆయకట్టు : **50 వేల ఎకరాలు**

కావలి కాలువకు కేటాయించిన జలాలు : **4.5 టీఎంసీలు**

ప్రయోజనం పొందే నియోజకవర్గాలు : **కావలి, ఆత్మకూరు, ఉదయగిరి**

కావలి కాలువ పరిధిలో ఉన్న చెరువులు : **55**

మేజర్ కాలువలు : **శ్రీవెంకటేశ్వరపాలెం, బ్రాహ్మణక్రాక**

ఉదయగిరి, జలదంకి: రైతుల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిరంతరం వ్యవసాయాభివృద్ధికి కృషి చేస్తున్నారు. పంట పొలాలకు సాగునీరు అందించి కర్షకులు తమ పొలాల్లో ధాన్య సిరులు పండించేలా ప్రోత్సహిస్తున్నారు. జిల్లాలోని సోమశిల జలాశయం నుంచి కావలి కాలువకు ప్రస్తుతం ఇస్తున్న 3 టీఎంసీలకు అదనంగా మరో 1.5 టీఎంసీలు కేటాయించి రైతుల పక్షపాతి అని సీఎం మరోసారి నిరూపించుకున్నారు. ఈ అదనపు జలాలు సాధించడంలో వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి విజయవంతం అయ్యారు. తద్వారా ఉదయగిరి, కావలి, ఆత్మకూరు నియోజకవర్గాల పరిధిలో ఉన్న కావలి కాలువ ఆయకట్టు రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతోంది.

నాడు దుర్భిక్షం.. నేడు సుభిక్షం

చంద్రబాబు పాలనలో నిత్యం కరువు కాటకాలతో ఇబ్బంది పడిన సోమశిల జలాశయం ఆయకట్టు రైతులకు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మంచి రోజులు వచ్చాయి. వరుణ దేవుడు కరుణించడంతో ఏటా సమృద్ధిగా వర్షాలు కురిసి జిల్లాలోని సోమశిల జలాశయంతోపాటు చెరువులు, కాలువల్లో నీరు పుష్కలంగా చేరింది. దీంతో వ్యవసాయం పండగలా మారింది. తద్వారా కర్షకుల ఆనందం అంతాఇంతా కాదు. ఏటా తమ పొలాల్లో ధాన్యసిరులను పండించి ఆర్థికాభివృద్ధిని సాధిస్తున్నారు. అయితే ఈ ఏడాది వర్షాలు అనుకున్న స్థాయిలో కురవకపోవడంతో సోమశిల జలాశయంలోకి తగినంత నీరు రాలేదు. అయినప్పటికీ జలాశయంలో అందుబాటులో ఉన్న నీటిలోనే కొంత మేర సాగునీరు పొలాలకు విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా అధికారులు కావలి కాలువకు 3 టీఎంసీలు కేటాయించారు. ఈ నీటితో కావలి కాలువ పరిధిలో ఉన్న రైతులు వరి పంట సాగు చేశారు. సంగం బ్యారేజీ నుంచి కావలి కాలువకు నీటిని విడుదల చేస్తారు. కాలువ ఆయకట్టు మొదట్లో ఉన్న పొలాలకు నీరు అందుతున్నా, జలదంకి మండలంలో 15 వేల ఎకరాలు సాగులో ఉన్న వరికి నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొంది. ఈ చివరి ఆయకట్టుకు నీరు అందకపోతే పొట్ట దశలో ఉన్న వరి పంట ఎండిపోయే ప్రమాదం ఏర్పడింది.



జలదంకి మండలంలో సాగులో ఉన్న వరి

అదనపు జలాల కోసం ప్రయత్నం

ఉదయగిరి నియోజకవర్గంలోని జలదంకి మండలంలో కావలి కాలువ పరిధిలో ఒక్క ఎకరం వరి పంట కూడా ఎండిపోకుండా అదనపు జలాల కోసం వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి నెల రోజుల నుంచి తీవ్రంగా ప్రయత్నించారు. అనేక సార్లు వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని, కలెక్టర్ హరినారాయణన్‌ను, సీఎంఓ కార్యాలయ అధికారులను కలిసి రైతుల పరిస్థితిని కూలంకషంగా వివరించారు. ప్రస్తుతం విడుదల చేస్తున్న 3 టీఎంసీలకు అదనంగా కేటాయింపులు చేయలేమని జిల్లా అధికారులు చెప్పినప్పటికీ పట్టు వదలని విక్రమార్కుడిలా అధికారులతో చర్చలు జరిపారు. చివరకు సీఎంఓలో ఉన్న ప్రత్యేక కార్యదర్శి ద్వారా రైతుల సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి వెంటనే స్పందించారు. సోమశిల జలాశయం నుంచి కావలి కాలువకు అదనంగా 1.5 టీఎంసీలను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో జలదంకి మండలంలో సాగులో ఉన్న 15 వేల ఎకరాల వరి పైరును కాపాడుకునే అవకాశం రైతులకు కలిగింది. ముఖ్యమంత్రి నిర్ణయం కర్షకుల్లో ఆనందాన్ని నింపింది.



రైతులతో కలిసి కావలి కాలువ పరిధిలో ఉన్న వరి పంటను పరిశీలిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

నాకు ఎంతో ఆనందాన్నిచ్చింది



రైతులు ఏడాదికి ఒకసారి పండే పంట కోసం సంవత్సరం అంతా కష్టపడతారు. కానీ ఆ పంట చేతికందకపోతే వారి బాధలు వర్ణనాతీతం. ఇదే పరిస్థితి కావలి కాలువ పరిధిలో ఉన్న జలదంకి మండలం రైతులకు వచ్చింది. ఈ సమస్య నా దృష్టికి రావడంతో పలుమార్లు అధికారులతో మాట్లాడాను. అయినా జాప్యం జరుగుతుండడంతో వ్యవసాయశాఖ మంత్రి సహకారంతో సీఎం దృష్టికి తీసుకెళ్లాను. సీఎం వెంటనే ఆమోదం తెలిపి 1.5 టీఎంసీలు కావలి కాలువకు కేటాయించడం చాలా ఆనందంగా ఉంది. రైతుల ముఖాల్లో సంతోషం నాకెంతో ఆనందాన్నిచ్చింది.

– మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఉదయగిరి సమన్వయకర్త

సీఎం సాయం మరువలేం



జలదంకి మండలంలో సాగులో ఉన్న 15 వేల ఎకరాల వరి పంటకు సరిపడా నీరు అందక ఎండిపోయే దశలో మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ద్వారా సమస్య తీవ్రతను సీఎం దృష్టికి తీసుకెళ్లాం. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే స్పందించి 1.5 టీఎంసీలు కావలి కాలువకు కేటాయించి ఆయకట్టు రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకున్నారు. ఆయన చేసిన సాయాన్ని మరువలేం.

– పాలవెల్లి మాలకొండారెడ్డి, జలదంకి

అదనపు జలాల కేటాయింపుతో ప్రాణం వచ్చింది



పొట్టదశలో ఉన్న వరి పైరుకు సాగునీరు సక్రమంగా అందని నేపథ్యంలో దిగులు పడ్డాం. కానీ అదనపు జలాల కేటాయింపుతో నా వరి పంట కచ్చితంగా పండుతుందనే నమ్మకం వచ్చింది. సీఎం తీసుకున్న ఈ నిర్ణయంతో ప్రాణం లేచి వచ్చినట్టుంది. ఎంతో మంది రైతులకు మేలు జరుగుతోంది.

– సుధాకర్‌రెడ్డి, బ్రాహ్మణక్రాక, రైతు

అదనంగా 1.5 టీఎంసీలు

కావలి కాలువకు 3 టీఎంసీలు కేటాయించి నీరు విడుదల చేస్తున్నాం. అయితే సీఎంఓ నుంచి మరో 1.5 టీఎంసీల జలాలు కేటాయిస్తూ సోమవారం ఉత్తర్వులు అందాయి. దీంతో ఈ సీజన్‌లో కావలి కాలువకు 4.5 టీఎంసీలు నీరు విడుదల చేస్తాం. తద్వారా కావలి కాలువ పరిధిలో ఉన్న చివర ఆయకట్టు రైతులకు నీరందే అవకాశం కలిగింది.

– రమణారెడ్డి, ఈఈ, సోమశిల ప్రాజెక్ట్

పకడ్బందీగా పది, ఇంటర్ పరీక్షలు

- మార్చి 1 నుంచి ఇంటర్, 18 నుంచి పదో తరగతి పరీక్షలు
- పక్కాగా ఏర్పాట్లు చేయండి
- కలెక్టర్ హరినారాయణన్



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించేలా ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణపై మంగళవారం నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. 81 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించే ఇంటర్మీడియట్ పరీక్షలకు 52,076 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. వీరిలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు 25,202 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 24,243 మంది, ఒకేషనల్‌కు విద్యార్థులు 2,631 మంది ఉన్నారని తెలిపారు. 4 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 176 పరీక్ష కేంద్రాల్లో జరగనున్న 10వ తరగతి పరీక్షలకు మొత్తం 32,834 మంది విద్యార్థులు హాజరుకానున్నారని వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా 10 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేస్తామన్నారు. కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేసి 10వ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణను విజయవంతం చేయాలన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు పరీక్ష సమయానికి నిర్ణీత సమయం కన్నా ముందుగానే చేరుకునేలా, ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ఇందుకు సంబంధించి పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసి అన్ని పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులను తనిఖీ చేసేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. పోలీసు శాఖ ద్వారా పరీక్ష కేంద్రాల వద్ద గట్టి భద్రతా ఏర్పాట్లు చేయాలని, పరీక్షల సమయంలో 144 సెక్షన్ అమలు చేయాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల సమీపంలో ఎక్కడా జిరాక్స్ కేంద్రాలు ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాలకు ఎలాంటి మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించకుండా గట్టి చర్యలు చేపట్టాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో గుర్తింపు పొందిన అధికారులు, సిబ్బంది మాత్రమే ఉండాలని, ఇతర వ్యక్తులు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్యారోగ్యశాఖ ద్వారా పరీక్ష కేంద్రాల్లో వైద్యసిబ్బందిని ఏర్పాటు చేయాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లను సరఫరా చేయాలని, అలాగే ప్రథమ చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షల సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్‌శాఖ అధికారులకు తెలిపారు. ఆర్టీసీ అధికారులు విద్యార్థులకు సౌకర్యవంతంగా పరీక్షలకు ఒక గంట ముందుగానే వెళ్లేలా వివిధ గ్రామాల నుంచి బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. రవాణాశాఖ ద్వారా పరీక్షల ప్రశ్నపేపర్ల పంపిణీకి వాహనాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పది, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన పోలీసు భద్రతా ఏర్పాట్లను చేసి పరీక్షలను విజయవంతం చేయాలన్నారు. తొలుత జిల్లాలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు చేపట్టాల్సిన కార్యాచరణపై ఆర్ఐఓ శ్రీనివాసులు, డీఈఓ గంగాభవాని కమిటీ సభ్యులకు వివరించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వికాస్‌మర్మత్, డీఆర్ఓ లవన్న, ఏఎస్పీ శ్రీనివాసులు, డీటీసీ చందర్, డీపీఓ సుస్మిత, అడిషనల్ కమిషనర్ శర్మద, డిప్యూటీ ఈఓ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మెరుగైన విద్యాబోధన

• కరేడు గిరిజన సంక్షేమ పాఠశాలను పరిశీలించిన కొలంబియా యూనివర్సిటీ ప్రొఫెసర్, స్కాలర్స్



కరేడు గిరిజన బాలికల పాఠశాలను పరిశీలించిన అలెక్స్ ఏబుల్

ఉలవపాడు: అన్ని రాష్ట్రాల కన్నా ఆంధ్రప్రదేశ్‌లో మెరుగైన విద్యను ప్రభుత్వం అందిస్తోందని ఉలవపాడు ఎంఈఓ ప్రసాదరావు తెలిపారు. కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఉత్తర్వుల మేరకు కొలంబియా యూనివర్సిటీ ప్రొఫెసర్, స్కాలర్స్ బృందం మంగళవారం ఉలవపాడు మండలంలోని కరేడు బాలికల గిరిజన పాఠశాలను పరిశీలించింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆయన వారికి వివరించారు. ప్రభుత్వం ఎనిమిదో తరగతి నుంచి విద్యార్థులకు బైజూస్ కంటెంట్ కలిగిన ట్యాబ్‌లను అందిస్తోందని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. ఉన్నత పాఠశాలలోని ప్రతి తరగతి గదిలో ఐఎఫ్‌పీ ప్యానల్‌ను ఏర్పాటు చేశామన్నారు. వాటి ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్నామన్నారు. విద్యార్థులకు పూర్తిస్థాయిలో సాంకేతిక విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. బృందంలోని ప్రధాన ప్రొఫెసర్ అలెక్స్ ఏబుల్ విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు ప్రభుత్వం ఇస్తున్న సౌకర్యాలను ఏ విధంగా సద్వినియోగం చేసుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. విద్యాపరంగా జరుగుతున్న సంస్కరణలపై బృందం హర్షం వ్యక్తం చేసింది.

3.5 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

వెంకటగిరిరూరల్: రేషన్ బియ్యం నిల్వలపై సీఎస్ డీటీ సంధ్య దాడులు నిర్వహించి 80 బస్తాల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. ఈ ఘటన వెంకటగిరి పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో చోటుచేసుకుంది. సీఎస్ డీటీ సంధ్య వివరాల మేరకు వెంకటగిరి పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసినట్టు సమాచారం అందగా.. సంబంధిత అధికారులు దాడులు నిర్వహించారు. ఓ నివాసంలో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 80 బస్తాల రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అదే ప్రాంతానికి చెందిన నిర్వాహకులు మాసాపేటలో కూడా రేషన్ బియ్యాన్ని నిల్వ చేసినట్లు తెలియడంతో అక్కడికెళ్లి పరిశీలించారు. ఆ తర్వాత ఎన్టీఆర్ కాలనీలో గుర్తించిన బియ్యం వద్దకు సిబ్బంది రాగా.. అక్కడ ఉన్న బియ్యాన్ని నిర్వాహకులు మాయం చేశారు. విషయం తెలుసుకున్న సంధ్య వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం నిల్వ చేసిన బియ్యాన్ని తమకు అప్పగించే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని సోమవారం అర్ధరాత్రి ఒంటి గంట వరకు అక్కడే భీష్మించుకు కూర్చున్నారు. మంగళవారం ఉదయం తిరుపతి విజిలెన్స్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ విజయ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని మొత్తం 550 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

క్లుప్తంగా

నగరంలో వేగంగా సీసీ కెమెరాల ఏర్పాటు

• కమిషనర్ వికాస్ మర్మత్



మాట్లాడుతున్న కమిషనర్

నెల్లూరు(బారకాసు): నగర వ్యాప్తంగా అన్ని ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో పలు విభాగాల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుమారు 200 ప్రాంతాలు గుర్తించామని, ఇప్పటికే 50 చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. వాటిని కార్పొరేషన్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానిస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా పారిశుద్ధ్య పనులపై పర్యవేక్షణ పెరుగుతుందన్నారు. దొంగతనాలు, ప్రమాదాలను గుర్తించడంతోపాటు అనుమానాస్పద వ్యక్తుల కదలికలను పరిశీలించనున్నామని తెలియజేశారు. త్వరలోనే మిగిలిన ప్రాంతాల్లో కూడా కెమెరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఎస్ఈ సంపత్‌కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, ఈఈ, డీఈఈలు తదితర అధికారులు పాల్గొన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు బహుమతులు



నగదు అందజేస్తున్న మేనేజర్

నెల్లూరు సిటీ: నెల్లూరు డిపో–1 పరిధిలో ఆదర్శ ఉద్యోగులకు మేనేజర్ మురళీకృష్ణ మంగళవారం నగదు బహుమతులు అందజేశారు. జనవరి నెలలో నగదు, టికెట్ల కలెక్షన్‌లో ప్రతిభ చూపిన కండక్టర్లు జీజేఎస్ రెడ్డి, ఎస్కే రెహ్మాన్, ఎన్ఎస్ రాయుడు, పోలయ్య, జీబీఎస్ మస్వం, డీజిల్ సేవ్ చేసిన డ్రైవర్లు మల్లికార్జున్, ప్రభాకర్‌ను ఆదర్శ ఉద్యోగులుగా ఎంపిక చేశారు. దీంతో మురళీకృష్ణ అభినందించి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 136
లేయర్ (లైవ్)	: 85
బ్రాయిలర్ చికెన్	: 240
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 266
లేయర్ చికెన్	: 145

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.63
సన్నవి	: రూ.50
పండ్లు	: రూ.25

మూగజీవాలకు మెరుగైన వైద్యం

• రికార్డు స్థాయిలో సర్జరీలు
• ఇతర చికిత్సలు 32 వేలకు పైగా..
• అల్ట్రా సౌండ్ ద్వారా ప్రత్యేక చికిత్సలు

నెల్లూరు(సెంట్రల్): ప్రభుత్వాస్పత్రుల్లో ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మూగజీవాలపై కూడా ప్రత్యేక దృష్టి సారించింది. పశుసంవర్ధక శాఖ అధికారులు జీవాలకు మెరుగైన వైద్యాన్ని అందించేలా చర్యలు తీసుకున్నారు. ప్రత్యేక స్కానింగ్ మెషీన్స్, అల్ట్రా సౌండ్ స్కానింగ్ తదితర పద్ధతుల ద్వారా ప్రత్యేక చికిత్సలు అందిస్తున్నారు. జిల్లాలో రికార్డు స్థాయిలో సర్జరీలు నిర్వహిస్తూ పాడి రైతుల ప్రశంసలు అందుకుంటున్నారు.

సర్జరీలు ప్రత్యేకం

నెల్లూరు నగరంలోని రైల్వే ఫీడర్స్ రోడ్డులో ఉన్న పశుసంవర్ధక శాఖ కార్యాలయ ఆవరణలోని ప్రధాన పశు వైద్యశాలకు జిల్లా నలుమూలల నుంచి పశుపోషకులు తమ మూగజీవాలను చికిత్సల కోసం తీసుకొస్తుంటారు. ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలే కాకుండా కుక్కలు, పిల్లులకు సైతం ఇక్కడ వైద్యం చేయిస్తుంటారు. ఈ పశు వైద్యశాలలో పశువులు, గొర్రెలు, కుక్కలకు 215 సర్జరీలు చేయగా, మరో 353 మైనర్ సర్జరీలు చేశారు. వీటిని పూర్తి ఉచితంగా చేయడంతోపాటు కొన్ని మందులను కూడా పశుపోషకులకు అందిస్తున్నారు.



కుక్కకు చికిత్స చేస్తున్న పశువైద్యులు మాలకొండయ్య, జయప్రకాష్ తదితరులు (ఫైల్)

అంబులెన్స్‌ల్లోనూ..

జిల్లాలో 16 వైఎస్సార్ పశు సంచార ఆరోగ్య సేవ వాహనాల ద్వారా క్షేత్రస్థాయిలోకి వెళ్లి మూగజీవాలకు వైద్యాన్ని అందిస్తున్నారు. ఈ వాహనాల ద్వారా డిసెంబర్ వరకు అత్యవసర కేసులు 215 రాగా అందులో 20 మేజర్ శస్త్రచికిత్సలు చేశారు. అలాగే మైనర్ సర్జరీలు 28, ఇతర చికిత్సలు 167 వరకు చేసినట్లు పశువైద్యులు తెలిపారు.

గతేడాదిలో..

నెల్లూరులోని ప్రధాన పశు వైద్యశాలలో గతేడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు 32,543 మూగజీవాలకు వివిధ రకాల చికిత్సలు చేసి రికార్డు సృష్టించారు. ఇక 8,296 రేబీస్ టీకాలు వేయగా, 11,811 మూగజీవాలకు ఇతర టీకాలు వేసినట్లు వైద్యులు తెలిపారు.

మందులు ఉచితంగా ఇస్తున్నాం



పశుపోషకులు మా వద్దకు తీసుకొచ్చే ప్రతి మూగజీవానికీ మెరుగైన వైద్యం అందిస్తున్నాం. అవసరమైన వాటికి సర్జరీలు చేస్తున్నాం. ఉచితంగా మందులు కూడా అందజేస్తున్నాం. జిల్లాలోని పశుపోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు.

– వి.కోటేశ్వరరావు, డిప్యూటీ డైరెక్టర్, వెటర్నరీ పాలి క్లినిక్, నెల్లూరు

ఒడిశా నుంచి బెంగళూరుకు గుట్టుగా..

• గంజాయి అక్రమ రవాణాకు యత్నం
• 8.74 కేజీలను స్వాధీనం చేసుకున్న ఎస్ఈబీ
• ఇద్దరు ఒడిశా వాసుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ తదితరులు

నెల్లూరు(క్రైమ్): ఒడిశా రాష్ట్రం నుంచి బెంగళూరుకు గంజాయిని అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎస్ఈబీ అధికారులు మంగళవారం అరెస్ట్ చేశారు. 8.74 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఈబీ నెల్లూరు–1 ఇన్‌స్పెక్టర్ ఆర్.విజయభాస్కర్‌రావు నెల్లూరులోని తన కార్యాలయంలో నిందితుల వివరాలను వెల్లడించారు. ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ఎస్ఈబీ ఇన్‌చార్జి సీహెచ్ సౌజన్య, ఈఎస్ బాబు శ్రీధర్ పర్యవేక్షణలో అధికారులు గంజాయి అక్రమ రవాణా, విక్రయాల కట్టడికి పటిష్ట చర్య లు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేశారు. మంగళవారం ఇన్‌స్పెక్టర్ విజయభాస్కర్‌రావు, డీఎస్ఈఓ పోలీసు టీమ్ ఎస్సై బాలకృష్ణ తన సిబ్బందితో కలిసి ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌లో తనిఖీలు చేపట్టారు. తిరుపతి ప్లాట్ ఫారం వద్ద అనుమానాస్పదంగా ఉన్న ఒడిశా రాష్ట్రం కోరాపూట్ జిల్లా సోరాడ గ్రామానికి చెందిన ఎ.శామ్యూల్, మరో గ్రామానికి చెందిన బిశ్వాంబర్ సాబాయిలను అదుపులోకి తీసుకున్నారు. వారి బ్యాగ్‌లను తనిఖీ చేసి రూ.1.02 లక్షల విలువ చేసే 8.74 కేజీల గంజాయి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను స్టేషన్‌కు తరలించి విచారించగా వారు కొంతకాలంగా కమీషన్ పద్ధతిపై ఒడిశా నుంచి వివిధ మార్గాల్లో బెంగళూరులోని వ్యాపారులకు గంజాయిని చేరవేస్తున్నట్లు బయటపడింది. దీంతో నిందితులను అరెస్ట్ చేశామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్, ఎస్సై శివరామప్రసాద్, డీఎస్ఈఓ ఎస్సై వారి సిబ్బందిని ఎస్ఈబీ ఇన్‌చార్జి, ఏఎస్పీ సీహెచ్ సౌజన్య అభినందించారు.

పాతకక్షలతో వ్యక్తిపై హత్యాయత్నం

• హోంగార్డుపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): పాతకక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై హోంగార్డు, అతని స్నేహితుడు కత్తులతో దాడి చేసిన ఘటనపై నెల్లూరు వేదాయపాళెం పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. గాంధీనగర్‌కు చెందిన రవికుమార్, సుమలత దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. రవికుమార్ తన అన్న నాగరాజుతో కలిసి అయ్యప్పగుడి సెంటర్‌లోని హెయిర్ కటింగ్ షాపులో పనిచేస్తున్నాడు. గతేడాది వినాయకచవితి వేడుకల్లో రవికుమార్‌కు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో పని చేస్తున్న హోంగార్డు సురేష్‌కు చిన్నపాటి గొడవ జరిగి వివాదానికి దారి తీసింది. అప్పట్లో హోంగార్డు ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు రవికుమార్‌పై కేసు నమోదు చేశారు. ఇటీవల జరిగిన లోక్ అదాలత్‌లో కేసు రాజీ అయింది. అయినా సురేష్ రవికుమార్ కనిపించినప్పుడల్లా అంతు చూస్తానని బెదిరించసాగాడు. ఇదే విషయాన్ని రవికుమార్ తన భార్యకు చెప్పి బాధపడ్డాడు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి షాపులో పని పూర్తయిందని, మెడికల్ షాపులో మందులు తీసుకుని ఇంటికి వస్తున్నానని రవికుమార్ భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. రాత్రి 11.30 గంటలవుతున్నా భర్త ఇంటికి రాకపోవడంతో ఆమె బయటకు వచ్చి వేచిచూడసాగింది. ఇంతలో అదే ప్రాంతానికి చెందిన కృష్ణ ఆమె వద్దకు వచ్చి నీ భర్తపై ఎవరో కత్తులతో దాడి చేస్తున్నారని చెప్పడంతో సుమలత కుమారుడిని వెంటబెట్టుకుని ఘటనా స్థలం వద్దకు వెళ్లింది. అప్పటికే హోంగార్డు సురేష్, అతని స్నేహితుడు విజయకృష్ణ కత్తులతో రవికుమార్‌పై దాడి చేయడాన్ని చూసి పెద్దగా కేకలు వేసింది. స్థానికులు రావడాన్ని గమనించిన నిందితులు బైక్‌పై పరారయ్యారు. తీవ్రగాయాలతో ఉన్న భర్తను ఆమె చికిత్స నిమిత్తం తొలుత జీజీహెచ్‌కు అక్కడి నుంచి మెరుగైన వైద్యపరీక్షల నిమిత్తం నగరంలోని కిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. సుమలత వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో హోంగార్డు, అతని స్నేహితుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

ధాన్యం కొనుగోలుకు ప్రత్యేక ప్రణాళిక

• కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు ఇప్పటి నుంచే ప్రత్యేకంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదేశించారు. నెల్లూరులోని క్యాంప్ కార్యాలయంలో ధాన్యం సేకరణపై మంగళవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. ధాన్యం సేకరణ చేపట్టేందుకు క్షేత్రస్థాయి సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. బ్యాగ్‌లను కేంద్రాల వద్ద సిద్ధంగా ఉంచాలన్నారు. ధాన్యాన్ని సాధ్యమైనంత వరకు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వ గోదాముల్లో నిల్వ చేయాలని అవసరమైతే, ప్రైవేట్ గోదాములు వినియోగించాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు ఈ–క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలన్నారు. కొనుగోలు ప్రారంభించక ముందే రైతు భరోసా కేంద్రాల వారీగా ఉత్పత్తి వివరాలను పౌరసరఫరాల శాఖకు అందజేయాలన్నారు. మార్కెటింగ్ అధికారులు పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.



పుస్తకాన్ని ప్రదర్శిస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు

సమావేశాలు నిర్వహించాలి

ప్రభుత్వం గ్రేడ్ ఏ రకం క్వింటాకు రూ.2,203, కామన్ వెరైటీకి రూ.2,183 ప్రకటించిందని కలెక్టర్ తెలిపారు. ఆ మొత్తానికి తక్కువ కాకుండా మద్దతు ధర లభించడానికి రైస్‌మిల్లుల అసోసియేషన్, ఫుడ్ కార్పొరేషన్, వ్యవసాయ, మార్కెటింగ్ ప్రాక్యూర్మెంట్ కమిటీలతో సమావేశాలు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌కు సూచించారు. ఒక్క రైతు కూడా తాను పండించిన ధాన్యానికి కనీస మద్దతు ధర రాలేదని బాధపడకూడదన్నారు. సంబంధిత అధికారులందరూ సమన్వయంతో పని చేసి ధాన్యం కొనుగోలుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ రూపొందించిన చిరుధాన్యాలతో రుచికరమైన వంటల పుస్తకాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారి సత్యవాణి, సివిల్ సప్లైస్ డీఎం లక్ష్మీనరసింహారావు, డీఎస్ఓ వెంకటరమణ, డీటీసీ చందర్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలు ప్రజలకు తెలుసు

• మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



బుక్‌లెట్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి

జలదంకి: 'తెలుగుదేశం నాయకులు ఇష్టానుసారంగా హామీలిస్తున్నారు. కానీ గతంలో చంద్రబాబు చేసిన మోసాలు ప్రజలకు ఇంకా గుర్తున్నాయి' అని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గోపన్నపాళెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు మేకపాటికి ఘనస్వాగతం పలికారు. ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరిందో చెప్పి బుక్‌లెట్లు పంపిణీ చేశారు. సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు జన్మభూమి కమిటీల ద్వారా ఎలా మోసగించారో ప్రజలకు తెలుసన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలను ఆర్థికంగా బలోపేతం చేశారన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలు సులువుగా అందిస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు పదవులు ఇచ్చారన్నారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా పథకాలు అందించడంతో ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరుస్తోందన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటామని ప్రజలు చెబుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పాలవెల్లి మాలకొండారెడ్డి, జెడ్పీటీసీ మేదరమెట్ల శివలీల, సొసైటీ అధ్యక్షుడు కేతిరెడ్డి రవీంద్రారెడ్డి, గోపన్నపాళెం సర్పంచ్ గండు వెంకారెడ్డి, నాయకులు గండు కృష్ణారెడ్డి, ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, తిప్పారెడ్డి ఇందిరమ్మ, రావి ప్రసాద్‌నాయుడు, తమ్మినేని సతీష్ నాయుడు, గుర్రం జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

మేకలు మేపేందుకు వెళ్లి..

• చెరువులో పడి బాలుడి మృతి



కళ్యాణ్ (ఫైల్)

ఆత్మకూరు: మండలంలోని కనుపూరుపల్లి గ్రామం దళిత కాలనీకి చెందిన ఓ బాలుడు మేకలు మేపేందుకు వెళ్లి చెరువులో పడి మృతిచెందిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు, ఆత్మకూరు పోలీసుల కథనం మేరకు.. కాలనీకి చెందిన వెంకటమ్మకు ముగ్గురు పిల్లలున్నారు. ఒక కుమార్తెకు వివాహం కాగా, మరో కుమార్తె ఇంటి వద్దనే ఉంటోంది. కుమారుడు వడిగ వెంకట కళ్యాణ్ (13) మురగళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. వెంకటమ్మ భర్త చనిపోవడంతో కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తోంది. వారికి మూడు మేకలున్నాయి. ఒక్కోసారి వెంకట కళ్యాణ్ వాటిని మేపేందుకు పొలాలు, చెరువు గట్టుకు తీసుకెళ్తుంటాడు. సోమవారం తల్లి పనికి వెళ్లింది. కళ్యాణ్ మేకలను చెరువు వద్దకు తోలుకెళ్లాడు. సాయంత్రమైనా బాలుడు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. ఆచూకీ దొరకలేదు. మంగళవారం ఉదయం చెరువు వద్ద చెప్పులు గమనించిన స్థానిక రైతు గ్రామస్తులకు విషయం తెలిపాడు. వారు వచ్చి చూడగా కళ్యాణ్ చెరువులోని కుంటలో కూరుకుపోయి మృతిచెంది ఉన్నాడు. ప్రమాదవశాత్తు చెరువులో పడి చనిపోయి ఉంటాడని భావిస్తున్నారు. దీంతో మృతదేహాన్ని బయటకు తీసి ఆత్మకూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కొడుకు మృతితో వెంకటమ్మ కన్నీరుమున్నీరుగా రోదిస్తోంది.